
# నేనేం చేసినా ఎదుటి వాళ్లకోసమే!

అవసరాల రామకృష్ణారావు



ముఖ్యమైన నా రెండు గుణాల్ని ముందుగా చెప్పకపోతే ఆఖర్న నేనెందుకా నిర్ణయం తీసుకుని వుంటానో మీకు బోధపడదు. నన్ను నేను పొగుడుకోవడమంటే నాకు పరమ అసహ్యం. నాకు ఇష్టం లేకపోయినా ఎదుటివారిని నొప్పించకుండా మసలుకోవడం రెండోది. నేను పూజించే దేవుడ్ని ఈ విధంగా నేను మెప్పించి వుండాలి. అందుకే ఎనభై నాలుగు దాటినా ఆ వయసు వాళ్లకి సాధారణంగా వచ్చే శారీరక రుగ్మతలు నన్ను బాధించలేదు.

ఇంతకాలం బతుకుతే ఏదో వేడుక చేసుకుంటారట కదా! ఆయుర్దాయం అంటూ వుంటే మనిషేకే కాదు తాటి చెట్టుకీ, తాబేలుకీ కూడా సహస్రచంద్రోత్సవం చేసుకోవచ్చు. తప్పక చేసుకోమని న్యూయార్కు నుంచి కొడుకూ, సిడ్నీ నుంచి అల్లుడూ పదేపదే అభినందనతోపాటు భారీ చెక్కులు కూడా పంపించారు. తిరక్కొట్టి వాళ్ల సున్నితమైన మనసుల్ని గాయపరచడమెం ఏకు! అలాగే చేసుకున్నాననే చిన్న అబద్ధంతో కృతజ్ఞతలు తెలిపాను.

ఆ మధ్య ఇలాగే వ రో మొహమాటంతో తప్పసరిగా ఇరుక్కోవలసి వచ్చింది. నా చిన్ననాటి స్నేహితుడు రాము ' నేను ఆ రోజులలో స్వతంత్ర పోరాటంలో అంతో ఇంతో పాలు పంచుకున్నాం. ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలు వదలక, ఎప్పుడూ ఎదిరించే గుంపులో చిట్టచివరి లైనులో నిలబడి మా దేశభక్తిని అందరూ ఆటపట్టించేవారు. జైలుకివెళ్లక పోవచ్చు కానీ 'భారత మాతాకీ జై' అనే వాళ్లలో మేము ఉన్నాంకదా! మరి ఎక్కడ ఏం చేసి సర్టిఫికెట్ పొందాడే కానీ స్వతంత్ర సమరయోధుల జాబితాలో తనతో పాటు నన్నూ చేర్పించాడు. రామూ తత్సంబధమైన నెలసరి ఉపకార వేతనం నాకూ అందుతోంది. నాకేం సంబంధం లేదని రుజువు చేస్తే నాతో పాటు వాడికీ అది ఆగిపోతుంది. ఇలాంటి కాని పనులు ఎలా చెయ్యనూ చెప్పండి!

నా చిన్నప్పుడే నాన్న పోతే ఎన్నో ఆర్థిక బాధలకు లోనై మా అమ్మ నన్నుచదివించి, వున్న నగలు కాస్తా అమ్మేసి ఒకరికి లంచమిచ్చి నన్ను ఉద్యోగస్థుడిని చేసింది. కట్నకానుకలంటే నాకెంత మాత్రమూ ఇష్టంలేదు. కానీ కష్టాలకోర్చి నన్నింత వాడిని చేసిన కన్నతల్లిని చూస్తూ చూస్తూ ఎలా నొప్పించను! ఏభైవేల కట్నంతో పాతిక తులాల బంగారంతో వచ్చిన రుక్మిణిని అందుకే పెళ్లాడక తప్పింది కాదు.


ఎన్నో అనుకుంటాం. ఎన్నెన్ని ఆదర్శాలో వల్లిస్తాం. కాని బాగా దగ్గర వాళ్ల మనసే కష్టపెట్టి మనం సాధించేది ఏముంటుంది?మా అమ్మ పోయాక ఎదుగుతున్న ఇద్దరు పిల్లల్తో ఇంటి చాకిరీ చేసుకోలేక నానా ఇబ్బంది పడుతున్న ఇల్లాలి కష్టం చూస్తుంటే నా కన్ను చెమర్చేది. తీరా ఆచరణలో పెడదామనుకుంటే? 'మీరిలా వంటింటి ఛాయలకు వచ్చారో నన్ను చంపుకు తిన్నట్లే అని కట్టుకున్నదే మూర్ఖత్వం వహిస్తే ఏం చెయ్యాలిట? రెండు తగల్నిచ్చి దాన్ని పక్కకి తోసేసే కఠినత్వం లేకపోయింది మరి!

ఆఖరికి దానికీ కాలం చెల్లి పదిహేనేళ్లయింది. ఇరవైనాలుగ్గంటలూ ఇంట్లో వుండే కుర్రాడిని కాక రెండు పూటలూ వచ్చి చేసి వెళ్లిపోయే ఓ వంటమనిషిని పెట్టుకున్నాను.

ఇంటి అద్దెలు, ఫించన్లూ, పిల్లలు పంపే డాలర్లూ ఇన్ని రకాల రాబడిని మేనేజ్ చేసే ఆరోగ్యం ఇంకా ఆ దేవుడు ఇచ్చాడు కనుక, ఒకర్ని ఏవిధంగానూ నొప్పించడం ఎరగను గనుక, రోజులు సజావుగా వెళ్లిపోతున్నట్లే లెక్క. డబ్బు బాగా పోగుపడుతోంది కనుక, నాకు బాగా నచ్చిన సత్కార్యం ఏదైనా చేసి మరీ తర్వాత విషయం ఆలోచిద్దామనే చింత మాత్రం ఈ మధ్య రోజు రోజుకీ పెరిగిపోజొచ్చింది. పేడ పురుగు కోడై కూసినట్లు వేల లెక్కన కొన్న మాసొంత ఇంటి జాగా ఇప్పుడు కోటి రూపాయలై కూచుందట! మా పిల్లలూ, రెండు జోడీలూ నాలుగు చేతులా సంపాదిస్తున్నారు. శలవుదొరికి వాళ్లు ఇటువైపు చూడడమే గగనం! అంటారు గాని తీరా ఏ అనాధాశ్రమానికో రాసి ఇచ్చేస్తే వారి మనసులు ఏం దెబ్బతింటాయో!అయినా వున్నట్టుండి ఏ దానకర్ణుడి బిరుదో నేనెంతమాత్రం భరించలేను. స్వోత్కర్ష అంటే నాకు సుతారామూ కిట్టదని మొదట్లోనే మొత్తుకున్నాను కదా! మాకు బాగా దూరపు బంధువు రామ్మూర్తి గారింటికి వెళ్లి ఓ గంట గడిపిరావడం కాదు గాని సొంత డబ్బా అనేది అన్యాపదేశంగా కొట్టుకోవడం ఎంత జుగుప్సాకరమో తెలిసింది. అనుభవం క్లుప్తంగా వివరిస్తాను.

రామ్మూర్తి వయసు ముప్పై వుంటుంది. భార్య పేరు చూడామణి. చెల్లెలు వనజ కూడా వాళ్ల దగ్గరే వుంటోంది. ఆదివారం కనుక అందరూ ఇంట్లోనే వున్నారు. అందరూ నన్ను తాతగారూ అని పిలుస్తూ ఓ పట్టాన వదల్లేదు. ఎందుకు వదల్లేదో అక్కడ్నుంచి కదిలి వచ్చేదాకా నాకు అర్థకాలేనంతగా నన్ను మాయ కబుర్లలో ముంచి తేల్చేశారు. నాకుబాగా ఇష్టమైన చిరుతిళ్లు కొసరి కొసరి తినిపించారు. తీరా ఎడ్వాన్స్ కూలీ అందుకున్నాక శ్రోతగా నిలబడక తప్పదు కదా!

నే వెళ్ళేసరికి వనజ ఏదో పుస్తకం తిరగేస్తోంది.



"ఏమిటమ్మా ఆ ఉద్గ్రంధం?'' అని అడిగానో లేదో దాన్ని ఆమె దాచేసే ప్రయత్నం చేసింది. వాళ్ల వదిన వనజని వారించింది. 'ఏదోతప్పు చేస్తూ దొరికిపోయినట్లు అవతలి వాళ్లు అదేదో సెక్సు బుక్కేమోఅని భ్రమపడేట్లు ఎందుకే అంత వెర్రి మొహమాటం! అది కాలేజీ మేగజైన్ అండీ తాతగారూ! చదువులో, ఎక్స్‌ట్రాకరిక్యులర్ యాక్టివిటీస్ అన్నిటిలోనూ మా వనజ ఫస్టు. మొట్టమొదటి పేజీలో తన ఫోటో పెద్ద సైజుది వేశారు.తాతగారికి చూపించి ఆశీర్వాదం పొందవే వెర్రిపిల్ల!''

అయినా ఆ అమ్మాయి వదినగారి మాట పాటించలేదు. అది నాకివ్వలేదు. పైగా చూడామణితో అంటుంది కదా 'ఏదో మామూలు విషయాన్ని పెద్దది చేసి అనవసరంగా నన్ను రచ్చకీడ్చావు. ఇన్నాళ్లకి మన బంధువు ఒకరొచ్చాక నీ మ్యూజికల్ టాలెంట్ కప్పెడుతాననుకున్నావా?' అంటూ ఆవిడెంత గా వారిస్తున్నా వినకుండా ఇలా చెప్పింది..

'నిరుడు వచ్చిన టైఫాయిడుకి గొంతుక బొంగురుపోయి ఇలా తయారయింది గాని మా వదిన స్వరం ముందు ఎస్.జానకి దిగదుడుపు. ఎందరో విద్వాంసుల దగ్గర ఎన్నో సర్టిఫికెట్లు పొందింది..'


అంటుంటే వెనక నుంచి రామ్మూర్తి అందుకున్నాడు.

'నన్ను చెప్పనివ్వవే. వచ్చిన ప్రశంసాపత్రాలకి గది చాలదు. అలాంటిది ఎక్కడికక్కడ చింపేసి ఇతింత ముక్కలు చేసేస్తుంది. పెద్దవారు మీరు చూస్తూ ఊరుకోకూడదు. చివాట్లు పెట్టండి. లేనిదే గొప్పలు చెప్పుకొని గొరిగించుకుంటారే... ఇదేం జబ్బో!'

మొగుడి మాట విని ఊరుకోవడానికి చూడామణి సిద్ధంగా లేదు.

'చూడండీ. అది జబ్బేఅయితే మీకూ అదేం తక్కువ పాళ్లలో లేదు. ఉన్నమాట చెప్పే హక్కు మీకే కాదు మాకూవుంది. ఆల్‌రౌండ్ స్పోర్ట్స్ మెన్ అనే మాట అదేం తప్పు పని చేస్తే వచ్చే బిరుదు కాదు కదా! ఇంట్లో ఏ అలమరా చూసినా ఆయనకొచ్చిన కప్పులూ, షీల్డులూ! ఆయనకొచ్చే ట్రాన్స్‌ఫర్స్‌తో వీటిని ఊరూరా తిప్పలేక మా ప్రాణాలు పోతున్నాయనుకోండి!'

అయ్యా... ఇలా సాగింది వాళ్ల పరస్పర డబ్బా. వెనుకటికి మాకు తెలిసిన సుందరమ్మ గారి వ్యాఖ్య గుర్తుకొచ్చింది. 'మా వారు పనిచేసేదా, ఓ విదేశీ కంపెనీలో. మా అబ్బాయా ఓ లిక్కర్ కంపెనీ చీఫ్ అకౌంటెంట్. మరి వంశంలో వున్న నియమం అదెంత గొప్పదోగాని కలలో అయినా చుక్క ముట్టుకొని ఎరుగరు కదా!' తండ్రీ, కొడుకులు కలిసి తాగడం చాలా అరుదు. కాని వాళ్లు అలాగే ఎంజాయ్ చేస్తుంటారని




అందరికీ తెలుసు! వాళ్ల పేర్లే రంగనాథం, రామనాథం గనుక. కడుపులో చుక్క పడకుండా తప్పించుకునేప్రసక్తే లేదు! మరి సుందరమ్మగారి పొగడ్త దేన్ని చూసుకునో! ఆవిడ్ని మేం మాత్రం 'సారా పత్ని, సారామాతా' అని రిఫర్ చేయకుండా వుండలేం.

రామ్మూర్తి ప్రసంశల హింస నుంచి తప్పించుకొని ఇంటికొచ్చాక కూడా నన్ను ఆ ఆలోచనలు వదిలిపెట్టలేదు. పార్టీ క్షేమం దృష్ట్యా కాబోలు సెంటరూ, స్టేటూ 'నా వీపు నువ్వు గోకు, నీ వీపు నేను గోకుతా' ఉద్యమంలో పునీతులై సేవ పేరున ప్రజల్ని బరికేస్తున్నారు. 'పారదర్శకంఅంటే పరమరహస్యం సుమా!'అనే కొత్త అర్థం నిర్వచిస్తున్నారు. రాజకీయ లబ్ది కోసం ఏ అవినీతి సొరాబ్దిలో దిగనియ్యి గాని రామ్మూర్తి లాంటి సామాన్య కుటుంబాల్లో కూడా ఇంతటి ఇండైరెక్ట్ ఏర్పాటా! స్టేజీ మీద ప్రైజునిస్తున్న మినిస్టరు గారు'మాలో ఆ రోజుల్లో ఉన్న పోటీ తత్వం ఇప్పుడేది? ఎన్నెన్నో ప్రైజులు కొట్టేననే నాలాంటి వాళ్లకే కదా ప్రైజు విలువ తెలిసేది!' అంటూ చల్లగా ఓ స్టేట్ మెంటు జార్చేస్తే అది సొంత డబ్బాకి అంకురార్పణఅని ఎవరెరగరని!' లోకంలో చాలా మంది దొంగపేనుగులో అని ఎవరైనా చెపితే అందులో నేను లేనుస్మా!అనే కదా భావన! ఇప్పటికి మావాడికి రెండు డజన్ల సంబంధాలైనా వచ్చివుంటాయి. అనే ప్రకటనలకి అర్థం ఏమిటి? బాగా భారీ కట్నం ఇచ్చుకంటే గాని మావాడు దొరకడు అనేకదా!

ఇలాంటి ఆలోచనలతో నా మతి పోతోంది.

సమృద్ధిగా సంపద వున్నవారు కూడా సత్యం ఎందుకు చెప్పరో సమాజ సేవకి ఎందుకు నడుం కట్టరో నాకుబోధ పడదు.

సరే... ఒకరి గొడవ నాకెందుకు? ఈ చివరికాలంలో ఇంతటి స్థిరాస్తి ఏం చేసుకోవాలో అది ముందు ఆలోచించుకోవాలి. 'తనని తను పొగుడకుంటే తన్నుకున్నట్టు' అనే ఆలోచన మాత్రం ఎదుటివారిని ఎట్టి పరిస్థితుల్లోనూ నొప్పించకూడదనే భావనకూడా నన్ను వదలదు.

అందుకని,పదే పదే ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చాను.

నాకు బాగా నచ్చినముగ్గురు సాహితీ వేత్తల్ని ఎంచుకున్నాను. వారి చేత వేరు వేరుగా నా జీవిత చరిత్ర రాయిస్తున్నాను. రెండు తరాల ముందు కంటే ఇప్పటి వరకూ ఫోటోలు సేకరించి ముద్రిస్తున్నాను. అన్నింటిలోనూ బాగా వచ్చిందేదో పండితుల చేత పరిష్కరింపచేసి, ఇంగ్లీషులోకి తెచ్చుకుంటే తర్వాత భారతీయ భాషలన్నింటిలోకి తీసుకురావచ్చు.

మా పెద్దహాల్లో నాకంచు విగ్రహం ఒకటి ప్రతిష్టించడానికి ఏర్పాట్లు పూర్తి చేశాను.

ఇష్టమైన వాళ్లు మా ఇంటికొచ్చి నన్ను దర్శించుకోవచ్చు.కావలసిన వాళ్లు నా పుస్తకం తెరిచి చదువుకోవచ్చు. ఇందులో పరోక్షం లేదు. బలవంతం లేదు. ముందు తరాల వారికి ఎప్పుడే మార్గదర్శకత్వం కావలసి వస్తుందో! నా డ్యూటీ నే చెయ్యకపోతే వాళ్లు నొచ్చుకోరు!

*